సమస్యల ఒడి.. నష్కల్ బడి

- అభివృద్ధికి నోచుకోని ప్రభుత్వ పాఠశాల
- క్రీడలకు అనువుగా లేని స్థలం
- ప్రహరీ లేకపోవడంతో పాఠశాలలో నుంచే పశువుల రాకపోకలు





ప్రహరీలేని ప్రభుత్వ పాఠశాల, (ఇన్‌సెట్‌లో) పాఠశాల ఆవరణలో క్రీడలకు అనువుగా లేని స్థలం

చిల్పూరు: ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించామంటూ నాయకులు చేస్తున్న వాగ్దానాలు ప్రస్తుతం ఈ పాఠశాలకు వర్తించలేదు. దీంతో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో 9 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలుండగా నష్కల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మాత్రం నేటికీ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. మూడున్నర ఎకరాల స్థలం ఉన్నా ఆటలాడుకునేందుకు స్థలం అనువుగా లేదు. ఈ పాఠశాలలో 66 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల ఏర్పడిన నాటినుంచి ప్రహరీ లేదు. దీంతో వ్యవసాయ బావుల వద్దకు పశువులతో వెళ్లేవారు పాఠశాల ఆవరణ నుంచే వెళ్తున్నారు. ప్రస్తుతం పాఠశాల స్థలం అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకునే నాథుడే లేరు. దీంతో పిచ్చి మొక్కలతో నిండి ఉంది. పీఈటీ, అటెండర్ లేక పోవడంతో విద్యార్థులే చదువుతో పాటు అన్ని పనులు చేసుకుంటున్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రహరీ లేక ఇబ్బందులు..



మూత్రశాలలకు వెళ్లాలంటే పాఠశాలకు ప్రహరీ లేక ఇబ్బంది పడుతున్నాం. చుట్టపక్కల పొలాలు ఉండడంతో పాఠశాల ఆవరణ నుంచే ప్రతి ఒక్కరూ వెళ్తున్నారు. అధికారులు స్పందించాలి. **- శాగంటి పూజ, 9వతరగతి**

ఎలాంటి సౌకర్యాలూ లేవు..



ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు అంటున్నారు. కానీ మా పాఠశాలలో ఎలాంటి సౌకర్యాలు లేవు. కనీసం పీఈటీ లేదు. తామే స్వయంగా ఆడుకుందామన్నా ఆవరణలో స్థలం అనువుగా లేదు.

-రడపాక దీక్షిత్, 7వ తరగతి

అధికారుల దృష్టికి తీసుకెళ్తా..



పాఠశాలలోని సమస్యలను అధికారులు, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా. గతంలో మన ఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా తమ పాఠశాలను చేర్చాలని కోరినా ఎవరూ స్పందించలేదు.

- కర్ణకంటి స్వప్న, సర్పంచ్

క్లుప్తంగా

జనం మెచ్చిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రవీణ్

జనగామ రూరల్: ప్రజల కష్టాలు తెలిసిన, జనం మెచ్చిన నాయకుడు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌టీపీ నాయకుడు బొడ్డు ప్రవీణ్ అన్నారు. గురువారం జగన్ పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో, పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలు నేటికి ప్రజలు మర్చిపోలేనివని, అలాంటి పాలన నేడు జగన్ అందిస్తున్నారని అన్నారు. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. నాయకులు శ్రీకాంత్, సామి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌బస్సు ఢీకొని గాయాలు



స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపాన రోడ్డు దాటుతున్న పట్ల రేణుక అనే మహిళను ఓ స్కూల్ బస్సు ఢీకొట్టగా ఆమెకు తీవ్రగాయాలైన సంఘటన గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన రేణుక గ్రామ పంచాయతీ కార్మికురాలిగా పనిచేస్తుంది. అయితే ఘన్‌పూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఉన్న ఆమె కుమార్తె కోసం పాలు, టిఫిన్ తీసుకుని ఘన్‌పూర్‌లో కాలినడకన రోడ్డు దాటుతుంది. అదే సమయంలో శివునిపల్లి నుంచి ఘన్‌పూర్ పాత గాంధీ చౌరస్తా వైపు వెళ్తున్న ఒయాసిస్ స్కూల్ బస్సు ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె కాళ్లపై నుంచి బస్సు టైర్లు వెళ్లడంతో రెండు కాళ్లు నుజ్జునుజ్జుకాగా తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో ఆమెను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా, బాధితురాలి తమ్ముడు గుగ్గిళ్ల అబ్బయ్య ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ నాగరాజుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సట్ల రాజు తెలిపారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి



పాలకుర్తి: మండలంలోని గూడూరులో ట్రాన్స్‌ఫారం వద్ద విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. భాషబోయిన కొమురయ్యకు చెందిన దుక్కిటెద్దు రోజుమాదిరిగా మేతకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. దుక్కిటెద్దు మృతితో రూ. 75 వేల నష్టపోయానని, విద్యుత్ అధికారులు ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

కణతి తొలగింపు



జనగామ రూరల్: ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థినికి ఉచితంగా కణతి ఆపరేషన్ చేసి తొలగించినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ తెలిపారు. గురువారం ఆపరేషన్ అయిన విద్యార్థిని వారు పరామర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు చేపట్టారు. తగు సలహాలు సూచనలు ఇచ్చారు. కేజీబీవీ రఘునాథపల్లి చెందని 9వ తరగతిచదువుతున్న నవ్యకు కెలాయిడ్ గుర్తించిన అధికారులు పరీక్షలు చేసి కణతిని గుర్తించి ఆపరేషన్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ భాస్కర్,శ్రీవాణి, సాయికుమార్, సరిత తదితరులు పాల్గొన్నారు.

భూతగాదా కేసులో ముగ్గురి రిమాండ్

చిల్పూరు: భూతగాదాలో ఘర్షణ పడి పలువురిపై దాడి చేసిన కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేయగా, కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఎస్సై వివరాలను వెల్లడించారు. ఇటీవల మండలంలోని మల్కాపూర్‌లో తండా సంపత్, తండా రాజుకు చెందిన భూవివాదంలో అదే గ్రామానికి చెందిన పొన్న రాజు, కనకం కుమార్, లింగంపల్లికి చెందన మోతె రాజు కలుగజేసుకుని గొడవకు దిగడంతో పాటు సంపత్, రాజును తీవ్రంగా కొట్టి గాయపర్చారు. అడ్డొచ్చిన వారిపై కూడా దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా జడ్జి రిమాండ్ విధించారని తెలిపారు.

మంత్రి వర్గంలో లంబాడీలకు అవకాశం ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న సేవాలాల్ సేనా కార్యకర్తలు

పాలకుర్తి టౌన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి గిరిజనులంతా గుంప గుత్తాగా ఓటు వేశారని సేవాలాల్ సేవా మండల అధ్యక్షుడు కునుసోత్ ప్రవీణ్ నాయక్ కోరారు. ఈ మేరకు గురువారం సేవాలాల్ సేనా ఆధ్వర్యంలో రాజీవ్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్న కేసీఆర్ గిరిజనులను మోసం చేశారని అన్నారు. ఆయన చేసిన మోసాన్ని తట్టుకోలేకనే గిరిజనులంతా కలిసి కాంగ్రెస్‌ను అధికారంలో తీసుకురావడం జరిగిందన్నారు. 12 శాతం ఉన్న రిజర్వేషన్ అమలు చేసి గిరిజనులకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలని అన్నారు. గిరిజనుల దైవం సంత్ సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సేవాలాల్‌సేనా మండల ఉపాధ్యక్షుడు ధరావత్ గొరియా, భూక్య యాకోబు, హరిసింగ్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

గణిత అష్టావధానంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న నరసింహమూర్తి

చిల్పూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జలాధి గణిత మిత్ర మండలి హనుమకొండ వారి ఆధ్వర్యంలో విద్యార్థులు గణిత అష్టావధానం నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం లీల అధ్యక్షత వహించగా రిటైర్డ్ గణిత లెక్చరర్, జలాధి వ్యవస్థాపకుడు నరసింహమూర్తి హాజరై గణిత అష్టావధానంలోని అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతీ విద్యార్థి మన స్వంకలన, భుజాల పురాణం తదితరాలపై అవగాహన కలిగిఉండాలని అన్నారు. ఉపాధ్యాయులు దుర్గ, పావని, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలి



ఓటరు జాబితాలో తొలగింపు పేర్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ విశాలాక్షి

బచ్చన్నపేట: మండలంలోని అన్ని గ్రామాల బీఎల్ఓలు ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని తహసీల్దార్ విశాలాక్షి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో బీఎల్ఓలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఓటరు జాబితాలో మృతిచెందిన, డబుల్ ఉన్న పేర్లను తొలగించేందుకు అవసరమయ్యే ఫారం–7ను దగ్గరుండి బీఎల్ఓల చేత పూర్తి చేయించారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీ ఎన్నికలు పూర్తి అయ్యేదాక బీఎల్ఓలు అంకితభావంతో విధులను నిర్వర్తించాలన్నారు. నియోజకవర్గంలోనే ఓటరు జాబితాను సమర్థవంతంగా ఉండేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ ఖాసీమ్, సీనియర్ అసిస్టెంట్ సుమన్, అన్ని గ్రామాల బీఎల్ఓలు పలువురు పాల్గొన్నారు.

బీసీ రుణాలు విడుదల చేయాలి



కొడకండ్ల: గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న బీసీ రుణాలు అదనంగా మరో రూ. లక్ష పెంచుతూ విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొమ్మగాని విక్రంగౌడ్ కోరారు. గురువారం హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ శాఖ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన బుర్రా వెంకటేశంను ఆయన కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం కూడా బీసీ రుణాల విషయంలో తక్షణం స్పందించి అందించి వారి అభ్యున్నతికి పాటుపడాలని ఆయన కోరారు.

మండల సభ వాయిదా



సంపత్‌రెడ్డికి సంతాపం తెలుపుతున్న సభ్యులు



ఎంపీపీకి స్వీట్ తినిపిస్తున్న ఎంపీటీసీ

లింగాలఘణపురం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ జయశ్రీ ప్రకటించారు. గురువారం సమావేశం ప్రారంభం కాగానే ఎంపీపీ మాట్లాడుతూ మండల సభ తేదీ నిర్ణయించిన సమయంలో అసెంబ్లీ సమావేశాలు లేవని ప్రస్తుతం జరుగుతున్న నేపథ్యంలో నిబంధనలకు అనుగుణంగా మండల సభను వాయిదా వేస్తున్నామని, త్వరలోనే తిరిగి మళ్లీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా మండల సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు.

స్వీట్లు పంపిణీ

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోని రావడంతో గురువారం మండల సభ ప్రారంభం కాగానే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు సభలో స్వీట్లు పంపిణీ చేశారు. అధికారంలో వచ్చిన అనంతరం మొదటిసారి జరిగిన మండల సభలో నేలపోగుల ఎంపీటీసీ గుగ్గిళ్ల నర్సయ్య, స్థానిక సర్పంచ్ విజయ్‌మనోహర్ మండల సభ్యులకు, అధికారులకు స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఇక నుంచి జరిగే మండల సభలు జవాబుదారితనంలో జరిగే విధంగా చూడాలని ఎంపీపీ జయశ్రీని కోరారు.

ప్రాణాలకు రక్షణ కవచం హెల్మెట్



హెల్మెట్ ధరించిన పాత్రికేయులతో సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై రఘుపతి

రఘునాథపల్లి: డ్రైవింగ్ చేస్తున్నప్పుడు అనుకోకుండా ప్రమాదాలు జరిగితే ప్రాణాలకు రక్షణ కవచంగా హెల్మెట్ ఉంటుందని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని సీఐ సర్కిల్ కార్యాలయంలో ఆయన ఎస్సై చాగర్ల రఘుపతితో కలిసి మండల పాత్రికేయులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ హెల్మెట్‌తో కలిగే ప్రయోజనాలను వివరించారు. ద్విచక్రవాహనదారులు వాహనం నడుపుతున్న సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. హెల్మెట్ ధరించక పోవడంతో ఎందరో ప్రాణాలు కోల్పోయి వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. రక్షణ కోసం ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు సరికాదు



నిరసన తెలుపుతున్న వీహెచ్‌పీ, ఏబీవీపీ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మినీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించడం ఏమాత్రం సరికాదని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు అందె వేణు అన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఘన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం రాత్రి మతపరమైన వేడుకలను నిర్వహించడాన్ని నిరసిస్తూ గురువారం పాఠశాల వద్ద విశ్వహిందూ పరిషత్, ఏబీవీపీ, భజరంగ్ దళ్, హిందూవాహిని ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారుల వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఈ విషయమై పాఠశాలలో హెచ్‌ఎంని సంప్రదించేందుకు వెళ్తే సెలవులో ఉందని తెలిపారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం తమకు సంబంధం లేదు అని చెబుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఎలాంటి అనుమతులు లేకుండా మినీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించిన వారిపై, హెచ్‌ఎంపై, విద్యాశాఖ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సదానందచారి, రమేష్, రామకృష్ణ, అనీల్, రాకేష్, కె.శరత్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

స్పెల్ బీ రీజినల్ పోటీలకు ఎంపిక

లింగాలఘణపురం: మండలంలోని వనపర్తి పీవీఆర్ పాఠశాలకు చెందిన ఐదో తరగతి విద్యార్థి బుడిగె చరిష్మా 'సాక్షి' నిర్వహించిన ఇంగ్లిష్ స్పెల్ బీలో రీజినల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరెస్పాండెంట్ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పరీక్షలు నిర్వహించి విద్యార్థుల ప్రతిభను గుర్తించడానికి సహకరించిన సాక్షి యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



సోరాబ్జీ చిత్రపటం వద్ద శివశంకర్, సిబ్బంది

బచ్చన్నపేట: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బచ్చన్నపేట బ్రాంచ్ మేనేజర్ శివశంకర్ అన్నారు. మండల కేంద్రంలోని బ్రాంచ్‌లో గురువారం ఘనంగా బ్యాంకు ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. బ్యాంకు వ్యవస్థాపకుడు సోరాబ్జీ పోచ్‌ఖన్‌వాలా చిత్రపటానికి పూలమాల వేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు రైతులకు, మహిళలకు, సంఘాల సభ్యులకు, స్వయం ఉపాధికి, వ్యాపారస్తులకు ఆర్థికంగా ప్రోత్సాహం అందించి వారి జీవనోపాధికి దోహదపడుతుందన్నారు. బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకి రుణాలను తీసుకొని జీవనోపాధి పొందాలని, తీసుకున్న రుణం వాయిదాలను సకాలంలో చెల్లించి మరికొంత మందికి రుణాలు అందడానికి సహకరించాలని కోరారు. అసిస్టెంట్ మేనేజర్ యుగందర్, రమేష్, ఫీల్డు అసిస్టెంట్ అరుణ, సిబ్బంది స్వరాజ్, రాధిక, సరిత, రాజు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు వినియోగించుకోవాలని సీబీఐ బ్యాంకు మేనేజర్ శివశంకర్ అన్నారు. మండలంలోని ఇటుకాలపల్లి, దబ్బగుంటపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో రూపొందించిన నూతన సంవత్సరం– 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. సర్పంచ్‌లు నాగిరెడ్డి రజిత, ముక్కెర కరుణాకర్‌రెడ్డి, ఎంపీటీసీ దూడల కనుకయ్య, మల్గ నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

కరోనా వైరస్‌పై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

చిల్పూరు: ప్రపంచ వ్యాప్తంగా మళ్లీ విజృంభిస్తున్న కరోనా వైరస్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కళాజాతా టీం లీడరు పిన్నమల్ల గద్దర్ సాంబయ్య అన్నారు. మండలంలోని వెంకటేశ్వరపల్లెలో గురువారం జిల్లా కలెక్టర్, సమాచార పౌరసంబంధాల శాఖ అధికారుల ఆదేశాల మేరకు కళాకారులు కళాజాత నిర్వహించారు. కార్యక్రమాన్ని సర్పంచ్ తోకల దివాకర్‌రెడ్డి ప్రారంభించగా సాంబయ్య మాట్లాడుతూ కరోనా మొదలైనందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత, మాస్క్ , శానిటైజర్ తప్పక వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఎడవెల్లి విజయ, బాలయ్య, శ్రీనివాసులు, చిరంజీవి, సంపత్‌కుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బంది సేవలు అభినందనీయం



సన్మానం పొందిన జీపీ సిబ్బందితో జెడ్పీటీసీ బేబీరాణి తదితరులు

జఫర్‌ఘడ్: గ్రామాభివృద్ధికి పాడుతున్న జీపీ సిబ్బంది సేవలు అభినందనీయమని జెడ్పీటీసీ ఇల్లందుల బేబీరాణిశ్రీనివాస్ అన్నారు. తిమ్మంపేట జీపీ సిబ్బంది, వాచర్లను గురువారం బేబీరాణి శ్రీనివాస్‌ల వివాహదినోత్సవం సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మొక్కల సంరక్షణ జీపీ సిబ్బంది ప్రధాన పాత్ర పోస్తున్నారని అన్నారు. సిబ్బందిని సత్కరించే అవకాశం రావడం సంతోషకరమన్నారు. సర్పంచ్ మల్లేష్, మండరాజయ్య, స్వామి, ప్రభాకర్, రమేష్, నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు

పార్టీ బలోపేతానికి కృషి

బచ్చన్నపేట: గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తమ్మడపల్లి సర్పంచ్ మేకల కవితరాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఇచ్చిన అన్ని హామీలు అమలు అవుతాయని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 17 ఎంపీ స్థానాలను గెలిపించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రదాత సోనియా గాంధీకి కానుకగా అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



తరిగొప్పుల: మండలకేంద్రానికి చెందిన ఎంపీటీసీ అర్జుల మధుసూదన్‌రెడ్డి తల్లి అర్జుల భారతమ్మ అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. కాగా, బాధిత కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు. భారతమ్మ పార్థివ దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. వగలబోయిన యాదగిరి, చిలువేరు సంపత్, గోరంతల వీరన్న తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

చిల్పూరు: మండలంలోని వంగాలపల్లి బస్‌స్టేజీ సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్థానిక ఎస్సై వినయ్‌కుమార్ అందించిన వివరాలు.. రాంపూర్‌కు చెందిన దేవర రాజు(50) పని నిమిత్తం ద్విచక్ర వాహనం(స్కూటీ)పై వంగాలపల్లి వైపు వస్తున్నాడు. వెనుకాలే వేగంగా వస్తున్న డీసీఎం వాహనం బైక్‌ను ఢీకొనడంతో ఎగిరి డీసీఎం కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారులు ఉన్నారు. ఎస్సై కేసు నమోదు చేయగా కానిస్టేబుల్ వీరు వీరన్న మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

నిబంధనలు ఉల్లంఘించి పత్తి కొనుగోళ్లు

- తేమ పేరిట కోత.. నష్ట పోతున్న రైతులు



చిల్లర కాంటాలో కొన్న పత్తిని సీసీఐకు తరలించేందుకు సిద్ధమతున్న లోడు

తరిగొప్పుల: పత్తి పంట దిగుబడులు రైతుల చేతికి రావడంతో పల్లెల్లో పత్తి దళారులు పాగా వేశారు. పెద్ద ఎత్తున కాంటాలు వేస్తూ పత్తి రైతులను దోచుకుంటున్నారు. పల్లెల్లో ఇష్టానుసారంగా పత్తిని కోనుగోళ్లు చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. మార్కెట్ యార్డుల్లో పత్తిని కొనుగోలు చేయాలన్న నిబంధనలను ఉల్లంఘించి మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో దర్జాగా కాంటాలు పెట్టేస్తున్నారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.7,800 ధర నిర్ణయించగా ఏమాత్రం లెక్క చేయకుండా తక్కువ ధర చెల్లిస్తున్నారు. మండలకేంద్రంలో కొందరు వ్యాపారులు సిండికేటుగా మారడంతో వారు నిర్ణయించిన ధరకే విక్రయించుకోవాల్సి వస్తోంది. ఇక తేమ పేరిట క్వింటాకు 2 కేజీల చొప్పున కోత విధుస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇంత జరుగుతున్నా మార్కెట్, వ్యవసాయ శాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.